కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

ఖమ్మం, డిసెంబర్ 30 : ఖమ్మం నగరంలోని వీడీఓస్ కాలనీలో గల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో 60 మంది లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు కమర్తపు మురళి, చావా నారాయణరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

నా విజయానికి సహకరించిన జర్నలిస్టులకు కృతజ్ఞతలు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబర్ 30 : నలభై ఏండ్ల నా రాజకీయ జీవితంలో తెలిసి ఏ తప్పు చేయలేదని, ఏ ఒక్కరినీ బాధ పెట్టలేదని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మీడియా ప్రతినిధుల గెట్ టు గెదర్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని జిల్లా అభివృద్ధికి ఉపయోగిస్తానే తప్ప తప్పు చేయనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం సహకరించిన జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి చర్చించి జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండీ జావిద్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, చావా నారాయణరావు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, రావూరి కరుణ, వెలుగొండ స్వామి పాల్గొన్నారు.

పల్లెదవాఖానను సందర్శించిన సెంట్రల్ టీం

పల్లెదవాఖానాను పరిశీలిస్తున్న సెంట్రల్‌టీం సభ్యులు

కొణిజర్ల, డిసెంబర్ 30: మండలంలోని పెద్దమునగాల పల్లెదవాఖానాను సెంట్రల్‌టీం సభ్యులు డాక్టర్ సుమన్, డాక్టర్ సన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దవాఖానాలో వసతులు బావున్నాయని, వైద్యులు, ఆశా కార్యకర్తల పనితీరు బాగుందన్నా దవాఖానా కోసం రూ.3 లక్షలు విలువ చేసే స్థలాన్ని ఇచ్చిన సర్పంచ్ పరికపల్లి శ్రీనును అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు రమేశ్, డాక్టర్ తేజస్విని, ఏఎన్ఎంలు ప్రభమణి, వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు నాగమణి, అలివేలు జ్యోతి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో సింగరేణి సమస్యలు పరిష్కరిస్తాం

సింగరేణి బాధితులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి హామీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 30: ఎన్టీఆర్ కాలనీలో సింగరేణి బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మట్టా రాగమయి సింగరేణి బాధితులకు హామీ ఇచ్చారు. శనివారం ఎన్టీఆర్ కాలనీలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలుత ప్రజాపాలన గ్రామసభలో ఆరు గ్యారెంటీలకు సంబంధించి అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోకచక్రవర్తి, పీవో వెంకటాచారి, మండల ప్రత్యేక అధికారి, మున్సిపల్ కమిషనర్ సుజాత, సీఐ మోహన్‌బాబు, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, రాంబాబు, పద్మజ్యోతి, నాగుల్‌మీరా, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో న్యూఇయర్ వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 30 : నగరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో 2024 నూతన సంవత్సరం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను అందంగా రంగవల్లులతో తీర్చిదిద్ది వేడుకలను జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అభ్యాసన పాఠశాలలో డైరెక్టర్స్ గొల్లపూడి రాంప్రసాద్, నాగేంద్రకుమార్, శ్రీచైతన్య, రెజొనెన్స్‌శ్రీనగర్ పాఠశాలలో కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి, త్రివేణి పాఠశాలలో డైరెక్టర్ వీరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సర్వజ్ఞ, రెజొనెన్స్ శ్రీనివాసనగర్‌లో రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, నీలిమ పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

కారేపల్లి: దుబ్బతండాలోఅధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

గోవిందాపురం-ఎల్‌లో ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

మధిర, డిసెంబర్ 30 : ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ.గౌతమ్ అన్నారు. శనివారం పట్టణంలోని 6వ వార్డు మడుపల్లి గ్రంథాలయంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 217 పంచాయతీలు, వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించి, 60 వేలకు పైగా దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజాపాలన సభల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో సందేహాలు నివృత్తి కోసం సాయం పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేశ్, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం/మధిర రూరల్/చింతకాని, డిసెంబర్ 30: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజలు అందించిన దరఖాస్తులను శనివారం కలెక్టర్ వీపీ.గౌతమ్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. మండలంలోని అయ్యవారిగూడెంలో అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ ప్రజాపాలన గ్రామసభలను సందర్శించారు. తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు. మధిర మండలంలోని అల్లీనగరం, రామచంద్రాపురం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీపీ మెండెం లలిత కోరారు. చింతకాని మండలంలోని చిన్నమండవ, సీతంపేట, కొదుమూరు, వందనం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఖమ్మం విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ పాల్గొని పరిశీలించారు.

కారేపల్లిలో..

కారేపల్లి, డిసెంబర్ 30: మండలంలోని గుట్టకింద గుంపు, చీమలపాడు, దుబ్బతండా, రేగులగూడెం, నానానగర్‌తండాల్లో శనివారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలను ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రకాశ్ సందర్శించారు. దరఖాస్తుదారులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని సూచించారు.

బోనకల్లులో..

బోనకల్లు, డిసెంబర్ 30: మండలంలోని గోవిందాపురం-ఎల్, చిరునోముల, చొప్పకట్లపాలెం గ్రామాల్లో జరిగిన గ్రామసభలను జడ్పీ సీఈవో ఇంజం వెంకటఅప్పారావు పరిశీలించారు. దరఖాస్తు ఫారాలను ముందుగానే అందించాలన్నారు.

కూసుమంచిలో..

కూసుమంచి, డిసెంబర్ 30: మండలంలోని ధర్మాతండాలో జరిగిన గ్రామసభలో వంద శాతం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ గ్రామసభను డీఆర్‌డీవో విద్యాచందన పరిశీలించి పలు సూచనలు చేశారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం, డిసెంబర్ 30: మండలంలోని కాకరవాయి, కొక్కిరేణి, ఎర్రగడ్డ, జల్లేపల్లి, హైదర్‌సాయిపేట గ్రామాల్లో జరిగిన గ్రామసభలను మండల ప్రత్యేకాధికారి విజయనిర్మల పర్యవేక్షించారు.

ప్రజాపాలనకు మంచి స్పందన

ఖమ్మం రూరల్, డిసెంబర్ 30: ప్రజాపాలన గ్రామసభలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఎంపీడీవో రవిందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆరెంపుల, తీర్థాల, మద్దులపల్లి, తెల్దారుపల్లి గ్రామాల్లో గ్రామసభలను మండల స్పెషల్ ఆఫీసర్ బీ జ్యోతి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. మద్దులపల్లి, తెల్దారుపల్లి సభలను తహసీల్దార్ పీవీ రామకృష్ణ ప్రారంభించారు.

దరఖాస్తులు పూర్తి స్థాయిలో అందించాలి

పెనుబల్లి/కల్లూరు/సత్తుపల్లి రూరల్/తల్లాడ/వేంసూరు, డిసెంబర్ 30: ప్రభుత్వం అందజేస్తున్న దరఖాస్తులను పూర్తిస్థాయిలో నింపి అందించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం మండలంలోని టేకులపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె మాట్లాడారు. కల్లూరు మండలంలోని బత్తులపల్లి, కప్పలబంధం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సత్తుపల్లి మండలంలోని బుగ్గపాడులో జరిగిన గ్రామసభలో దరఖాస్తుదారులు అధికారులకు అందజేశారు. తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, మిట్టపల్లి గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వేంసూరు మండలంలోని మొద్దులగూడెం, లింగపాలెం, ఎర్రగుంటపాడు గ్రామాల్లో తహసీల్దార్, డీటీ, ఎంపీడీవో దరఖాస్తులను స్వీకరించారు.

కూసుమంచి మండలం ధర్మాతండాలో ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్న డీఆర్‌డీవో విద్యాచందన

కొదుమూరులో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎస్ఈ సురేందర్

స్పెషల్ ఆఫీసర్ జ్యోతితో కలిసి కౌంటర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొణిజర్లలో...

కొణిజర్ల/వైరారూరల్/వైరా టౌన్, డిసెంబర్ 30: మండలంలోని లింగగూడెం, బస్వాపురం గ్రామాల్లో జరిగిన గ్రామసభలో ప్రజలు అధికారులకు దరఖాస్తులను అందించారు. వైరా మండలంలోని పాలడుగులో తహసీల్దార్ జే శ్రీనివాసరావు దరఖాస్తు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో చైర్మన్ జైపాల్, కౌన్సిలర్ మాదినేని సునీత దరఖాస్తు దారులనుంచి దరఖాస్తులు స్వీకరించారు.

పెనుబల్లి: టేకులపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

దోపిడీలేని సమాజ నిర్మాణమే లక్ష్యం : ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం కమాన్‌బజార్, డిసెంబర్ 30 : దోపిడీలేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్మదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆ పార్టీ 99 ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మం నగరంలో జనసేవాదళ్ కవాత్, భారీ ప్రదర్శన నిర్వహించారు. దోపిడీరహిత సమాజం కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. పార్టీ జాతీయ సభ్యుడు భాగం హేమంతరావు, నాయకులు మౌలానా, దండి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో ఫ్రెషర్స్ డే

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 30 : నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన విధంగా ఇన్నోసిస్, ఐసీటీ అకాడమీతో ఎంఓయూలు చేసుకున్నామన్నారు. చదువు అనంతరం కళాశాల ద్వారా అత్యుత్తమ వేతనంతో ప్లేస్‌మెంట్ కల్పించడమే ఎస్‌బీఐటీ ధ్యేయమన్నారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు

ఖమ్మం/ మామిళ్లగూడెం, డిసెంబర్ 30 : ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్డు రామాలయం వద్ద 415 గజాల ప్రభుత్వ భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించడంతో ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ భూమిలో ఉన్న నిర్మాణాన్ని తొలిగించి భూమిని స్వాధీనపర్చుకున్నట్లు పేర్కొన్నారు. జీవో 59 కింద పి.శ్రీవిద్య పేరుతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిపారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విచారణ అధికారి శ్రీరామ్ ఫిర్యాదు మేరకు ఖమ్మం టూ టౌన్ పోలీసులు శ్రీవిద్యతో పాటు ఆమె భర్త నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జమలాపురం ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి పూజలు

ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం

మధిర, డిసెంబర్ 30: ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. ప్రధాన ద్వారం వద్ద పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో డిప్యూటీ సీఎం భట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు డిప్యూటీ సీఎంకు వేదాశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ.గౌతమ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు, నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పీటీసీ శీలం కవిత, పైడిపల్లి కిశోర్, బంధం నాగేశ్వరరావు, రామరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కల్లూరు, డిసెంబర్ 30: సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ సూచనల మేరకు ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్ మండలంలోని బత్తులపల్లి, కొత్త బోడమెల్ల, వాచ్యానాయక్‌తండా, హనుమాతండాల్లో శనివారం దాడులు నిర్వహించారు. గుడుంబా తయారుచేస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ సాంబశివుడు ఎదుట బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు వ్యక్తులపై కేసు నమోదు

కారేపల్లి, డిసెంబర్ 30: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిని కత్తితో పొడిచి గాయపరిచిన నలుగురు వ్యక్తులపై శనివారం కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై పుష్పాల రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగురాళ్లబోడుకు చెందిన బానోత్ బాలాజీ, బానోత్ రాజు మధ్య కొంత కాలంగా పోడు భూమి విషయమై గొడవ జరుగుతున్నది. శుక్రవారం అర్ధరాత్రి బానోత్ బాలాజీ తన పిన్ని అజ్మీర చిన్నితో పాటు మరో ఇద్దరు కలిసి రాజు కడుపులో కత్తితో పొడిచి గాయపరిచారు. తీవ్రగాయాలైన రాజును కుటుంబ సభ్యులు ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బానోత్ రాజు భార్య భారతి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై రామారావు పేర్కొన్నారు.

గాంధీజీ వారసులు ఆర్యవైశ్యులు

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరాటౌన్, డిసెంబర్ 30: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం త్యాగాలతో రాష్ట్రం సాధించిన ఆర్యవైశ్యులు గాంధీజీ వారసులని, స్వాతంత్ర్య పోరాటంలో వీరు చేసిన సేవలు అమోఘమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం వైరాలో వైరా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తీసుకురావడానికి తమ వంతు పాత్ర వహించారని, వారిని రాబోయే కాలంలో మరిచిపోనన్నారు. ఆర్యవైశ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

వైరాటౌన్, డిసెంబర్ 30: విద్యార్థుల్లో కళాభివృద్ధితో పాటు సత్ప్రవర్తన, సంస్కారం, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని హెచ్ఎం తారాచంద్ అన్నారు. ఓల్డ్ కొత్తగూడెం బూడిదగడ్డలో సీహెచ్ఎస్ హెచ్ఎం తారాచంద్ ఆధ్వర్యంలో జేసీకేఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం వెంకటముత్యం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులను మంచి నాయకత్వ లక్షణాలు కలిగే విధంగా తీర్చిదిద్దడంలో సంఘం కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

డీఈవో సోమశేఖరశర్మ

గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఈవో

ఖమ్మం సిటీ, డిసెంబర్ 30 : క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసంతోపాటు విజయం పట్ల అభిరుచికి, ఐక్యతకు ఎంతో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ అన్నారు. శనివారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ప్రాంతీయ పాఠశాలల క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 14 పాఠశాలల నుంచి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్స్, రన్నింగ్ పోటీల్లో పాల్గొనేందుకు 1,591 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను డీఈవోతో కలిసి శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా బలంగా ఉంటేనే మానసిక వికాసాన్ని కలిగి ఉంటారని పేర్కొన్నారు. యాంత్రిక జీవనంలో చదువులకే అంకితమవుతున్న చిన్నారులకు ఆటల పోటీలు ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏజీఎంలు చేతన్‌మాధుర్, జయప్రకాష్, ప్రిన్సిపాల్స్ టీఎల్ఎన్ శర్మ, రాజ్‌కుమార్‌జోషి, ఏడుకొండలు, శ్రీదేవి, నీరజ, మురళీ మోహన్, రవికుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌లో 685 కేసులు పరిష్కారం

లోక్‌అదాలత్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న జడ్జీ కార్తీక్‌రెడ్డి

మధిర, డిసెంబర్ 30: మధిర మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం మధిర కోర్టు న్యాయమూర్తి టీ.కార్తీక్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మెగా లోక్‌అదాలత్‌లో 685 కేసులు పరిష్కారం కాగా రూ.1,22,770 జరిమాన విధించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, తుములూరి కృష్ణారావు, సీ.గోపాల్, డీ.జగన్మోహన్‌రావు, డీ.సుబ్రమణ్యం, ఎన్.జనార్దన్‌రావు, టీ.వెంకట్రావు, జే.రమేశ్, కే.వియకుమార్, జీ.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ఎన్.నాగలక్ష్మి, జన్ను భద్రయ్య అధికారులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 30: రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్‌జడ్జి అరుణకుమారి అన్నారు. శనివారం సత్తుపల్లి కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా 587 కేసులను రాజీ చేశామన్నారు. కోర్టులో కేసులను ఎంత త్వరగా రాజీచేసుకుంటే కక్షిదారులకు అంత లాభదాయకమన్నారు. అనంతరం కక్షిదారులకు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. లోక్‌అదాలత్‌కు వచ్చిన వారికి పులిహోర ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి ఆయేషా సరీన్, ఏసీపీ రామానుజం, ఎస్సై శ్రావణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాకలపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకటరావు, బోయినపల్లి రవి, న్యాయవాదులు, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

ప్రజాపాలన

షెడ్యూల్‌లో మార్పులు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 30: ప్రజాపాలన గ్రామసభలకు కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి మరో టీం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రవిందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి ఆ టీం అందుబాటులో వస్తుందన్నారు.

విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

మధిరరూరల్, డిసెంబర్ 30: మండలంలోని మాటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం సంగు కృష్ణాంజనేయులు, ఉపాధ్యాయురాలు డీ.కవిత పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కవితా పోటీల్లో రమణమూర్తికి బహుమతి

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 30: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల్లో సత్తుపల్లికి చెందిన సాహితీవేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్వీ రమణమూర్తికి సీనియర్ సిటిజన్స్ అంశంగా రాసిన కవితకు ప్రథమ బహుమతి లభించింది.

మాస్కుల పంపిణీ

కల్లూరు, డిసెంబర్ 30: కల్లూరులో సర్పంచ్ లక్కినేని నీరజ మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆదేశాల మేరకు శనివారం ప్రజలు, ప్రయాణీకులకు మాస్కులు పంపిణీ చేశారు.

రోశమ్మకు నివాళి

తల్లాడ, డిసెంబర్ 30: మండలంలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన అయిలూరి రోశమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్లు అందజేత

వైరారూరల్, డిసెంబర్ 30: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలో లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు అధ్వర్యంలో ఫ్యాన్లను దాతలు ఏలూరి సాంబశివరావు, శాంతా అందజేశారు.

ఉప ముఖ్యమంత్రికి వినతి

తిరుమలాయపాలెం, డిసెంబర్ 30 : ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దు గ్రామాలను కలిపి బచ్చోడు కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ అడ్వకేట్ తిమ్మిడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత

కొణిజర్ల, డిసెంబర్ 30: మండలంలోని తనికెళ్ల ప్రభుత్వ పాఠశాలకు పాఠశాల పూర్వవిద్యార్థి యాస కృష్ణకుమారి తమ తల్లిదండ్రులు లక్ష్మీనర్సయ్య, శాంతమ్మ జ్ఞాపకార్థం ఆటవస్తువులు శనివారం అందజేశారు. అదేవిధంగా సాయంత్రం అదనపు తరగతుల నిర్వహణకు అల్పాహారం అందిస్తానని హామీ ఇచ్చారు.

విజయ ఇంజినీరింగ్ కళాశాలలో న్యూఇయర్ వేడుకలు

కొణిజర్ల, డిసెంబర్ 30: మండలంలోని తనికెళ్ల విజయ ఇంజినీరింగ్ కళాశాలలో న్యూఇయర్ వేడుకలను శనివారం నిర్వహించారు. విద్యార్థులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.చిన్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులకు కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్‌చైర్‌పర్సన్ పారుపల్లి విజయలక్ష్మి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

కల్లూరు, డిసెంబర్ 30: కల్లూరు లిటిల్ ఫ్లవర్ చర్చిలో శనివారం చర్చి ఫాదర్ సురేశ్ జోష్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

బీఆర్ఎస్ నాయకుని మృతికి నివాళి

చింతకాని, డిసెంబర్ 30 : మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెంట్యాల సైదేశ్వరరావు(70) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు క